పదోన్నతులు, బదిలీల షెడ్యూల్ విడుదల చేయాలి

ఎస్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్

కొడంగల్, మే 19 : ఉపాధ్యాయుల పదోన్నతులకు న్యాయపరమైన ఆటంకాలు తొలగిపోయినందున పదోన్నతులు, బదిలీలను ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకొని వీలైనంత త్వరగా షెడ్యూల్‌ను విడుదల చేయాలని ఎస్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో జరిగిన ఎస్‌టీయూ ద్వితీయ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల ప్రారంభం నాటికి పదోన్నతులు, బదిలీల ప్రక్రియ పూర్తయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. 2010 ఆగస్టు 23కు పూర్వం నియామకమైన ఉపాధ్యాయులకు టెట్‌తో నిమిత్తం లేకుండా పదోన్నతులు ఇవ్వాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చినందున ఉపాధ్యాయులకు పాఠశాల స్థాయి మారిన సందర్భంలో మాత్రమే టెట్ అవసరమన్నారు. ఎన్‌సీటీఈ వివరణ ఉత్తర్వులు ఇవ్వడంతో పదోన్నతులకు ఉన్న ఆటంకాలన్నీ తొలగిపోయాయని, నిలిచిపోయిన ప్రక్రియను ప్రారంభించాలని కోరారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను అమలుచేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ, ఎరియర్స్‌తో పాటు అన్ని రకాల పెండింగ్ బిల్లులను వెంటనే ఖాతాల్లో జయ చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ షఫి తదితరులు పాల్గొన్నారు.

కరివేపాకు సాగు ఆదాయం బాగు

ఏడాదికి రూ.1.60 లక్షల ఆదాయం
-తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ లాభం
-సగం ఎకరాలోనే పంట సాగు

బొంరాస్‌పేట, మే 19 : మండలంలోని రేగడిమైలారం గ్రామానికి చెందిన ఎంపీటీసీ జంగం జగదీష్ తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ లాభాలు వచ్చే పంటల సాగును ఎంచుకుని లాభాలు పొందుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. జగదీష్‌కు రెండున్నర ఎకరాల పొలం ఉంది. 2019 మే నెలలో బోరు వేయడంతో పుష్కలంగా వచ్చాయి. సాంప్రదాయ పంటలను కాదని లాభాలు వచ్చే పంటలు సాగు చేయాలని నిర్ణయించుకున్నాడు. తక్కువ నీటితో ఎక్కువ లాభం వచ్చే కరివేపాకు సాగును ఎంచుకున్నాడు. ఆ ఏడాది జూలై నెలలో రూ.15 వేలతో 40 కిలోల కరివేపాకు విత్తనాలను కొనుగోలు చేసి 30 గుంటల పొలంలో విత్తాడు. పొలం దున్ని విత్తనాలు వేసే వరకు రూ.50 వేలు ఖర్చయింది. సంకరజాతి విత్తనాలు కావడంతో ఆరు నెలల తరువాత 2020 జనవరిలో కరివేపాకు చెట్లు పెరిగాయి. జనవరి నుంచి ఈనాటి వరకు కరివేపాకుతో రోజూ వెయ్యి రూపాయలు సంపాదిస్తున్నాడు. ప్రతి రోజూ వాటి రెమ్మలను తెంపి కట్టలుగా కట్టి తాండూరు, కొడంగల్, పరిగి పట్టణాలకు వెళ్లి రూ.2లకు ఒక కట్ట చొప్పున వ్యాపారులకు అమ్మి వస్తున్నాడు. కరివేపాకుతో ఏడాదికి రూ.1.60 లక్షల ఆదాయం వస్తుందని జగదీష్ తెలిపాడు. ఒకసారి విత్తనాలను నాటితే 25 సంవత్సరాల వరకు చెట్ల నుంచి కరివేప తీసుకోవచ్చని ఆయన తెలిపాడు. నీటి వినియోగం కూడా చాలా తక్కువని, వేసవి, చలి కాలంలో పదిహేను రోజులకు ఒకసారి నీళ్లు పెడితే సరిపోతుందని చెప్పాడు. వర్షాకాలంలో కురిసే వర్షంతోనే పెరుగుతుందని తెలిపాడు. తరుచూ కలుపు తీస్తూ, పురుగు రాకుండా మందులు పిచికారీ చేస్తూ మొక్కలను జాగ్రత్తగా కాపాడుతున్నానని చెప్పాడు.

తక్కువ నీటితో పంటలు సాగు చేయొచ్చు

సాంప్రదాయంగా రైతులు పండించే వరితో ఎక్కువగా లాభం లేదు. తక్కువ నీటితో ఎక్కువ లాభం వచ్చే ఆకు కూరలు, కూరగాయలు, కరివేపాకు వంటి వాటిని సాగు చేస్తే మంచి లాభాలు పొందవచ్చు. తనకున్న రెండున్నర ఎకరాల పొలంలో కరివేప సాగు చేశాను. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో లాభాలు వస్తున్నాయి. ప్రతి రోజూ పొలం వద్దే ఉంటా. కూలీలతో కరివేపను తెంపి కట్టలుగా కట్టి మార్కెట్‌కు వెళ్లి అమ్మి వస్తా.

-జగదీశ్, రైతు, రేగడిమైలారం

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

బొంరాస్‌పేట, మే 19 : మండలంలోని చౌదర్‌పల్లిలో రైతుల పొలాల్లో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. మనిషికి తగిలే ఎత్తులో ఉన్న ఈ విద్యుత్ తీగలతో ప్రమాదం పొంచి ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులు కటికె నగేశ్, మల్లప్ప పొలాల్లో చాలా కిందికి విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని, వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు, పశువుల కాపరులు ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా విద్యుత్‌షాక్ తగులుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేయాలని రైతులు కోరుతున్నారు.

సుందరయ్య ఆశయ సాధనకు కృషి



సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పరిగి, మే 19 : భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ్య సాధనకు నిరంతరం కృషి చేస్తామని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆర్.వెంకట్రాములు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య పేర్కొన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆదివారం పరిగిలో ఆయన చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుందరయ్య జీవిత కాలమంతా సమాజానికి మార్గదర్శకంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ హబీబ్, యాదగిరి, సత్తయ్య, రఘురాం, లాలయ్య, ప్రభు, రవి, మాణిక్యం, వెంకటయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యాలాలలో విషాదం

పిడుగుపాటుకు ముగ్గురి మృతి

యాలాల, మే 19 : గాలివాన బీభత్సానికి యాలాల మండలంలో విషాదం చోటు చేసుకుంది. ఆదివారం మండల పరిధిలోని బెన్నూరు, జుంటుపల్లి గ్రామాల్లో పిడుగుపడి ముగ్గురు మృతి చెందారు. బెన్నూరులో గొల్ల ఎంకప్ప(60), జుంటుపల్లిలో మంగలి శ్రీనివాస్ (26), కొన్నింటి లక్ష్మప్ప (45) పిడుగుపాటుకు అకాల మరణం చెందడంతో ఆయా గ్రామాల్లో విషాద వాతావరణం నెలకొంది. మృతుల కుటుంబ సభ్యుల రోదనలు ప్రతి ఒక్కరిని కలిచి వేశాయి.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

మండల పరిధిలోని బెన్నూరు, జుంటుపల్లి గ్రామాల్లో పిడుగుపడి ముగ్గురు మృతి చెందిన బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ పరంగా అందాల్సిన రూ.6 లక్షల ఆర్థిక సాయాన్ని వెంటనే అందించే విధంగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని ఆర్డీవోకు సూచించామన్నారు.

రుద్రారంలో కాలిన చెట్టు..

కొడంగల్ : మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షం కురిసింది. గ్రామ సమీపంలోని ఒక చెట్టుపై పిడుగు పడడంతో మంటలు చెలరేగి చెట్టు కాలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

రోడ్డు ప్రమాదంలో బీహార్ వాసి మృతి

బండ్లగూడ, మే 19: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. అత్తాపూర్ పిల్లర్ నంబర్ 150 వద్ద ఆరాంఘర్ నుంచి మెహిదీపట్నం వైపు బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి కింద పడిపోవడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడిని బీహార్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దృష్టి మరల్చి.. గొలుసు కాజేశారు

బంజారాహిల్స్, మే 19: బస్సులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి దృష్టి మరల్చిన దుండగులు బంగారు గొలుసు కాజేశారు. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నం. 11లోని ఉదయ్‌నగర్‌కు చెందిన ఏసుదాస్ ప్రభుత్వ ఉద్యోగి. ఈ నెల 17న సాయంత్రం మెహిదీపట్నంలో ఆర్టీసీ బస్సు ఎక్కి ఇంటికి బయలుదేరాడు. కేర్ ఆస్పత్రి బస్టాప్ వద్దకు రాగానే.. బస్సు దిగేందుకు ప్రయత్నిస్తున్న ఏసుదాస్‌ను బస్సులో ఉన్న నలుగురు వ్యక్తులు అడ్డుకున్నారు. మద్యం మత్తులో ఉన్నట్లు నటించిన వారు.. అతడిని తోసేయడంతో హెడ్‌సెట్ కిందపడిపోయింది. హెడ్‌సెట్ కోసం ముందుకు వంగిన సమయంలో దుండగులు.. అతడి మెడలో ఉన్న 2.5 తులాల బంగారు గొలుసును లాక్కున్నారు. ఈ విషయాన్ని గమనించని ఏసుదాస్ ఇంటికి వెళ్లిపోయాడు. మరుసటి రోజు మధ్యాహ్నం ఆఫీసులో తన మెడలోని గొలుసు చూసుకోగా కనిపించలేదు. తొలుత ఇంట్లో పడిపోయి ఉండవచ్చని భావించి వెతికారు. ఇంట్లో గొలుసు దొరకలేదు. ముందురోజు బస్సులో జరిగిన తోపులాట, తనను ఉద్దేశపూర్వకంగా నలుగురు వ్యక్తులు అడ్డగించి తోసేసిన విషయం గుర్తు చేసుకున్నాడు. దీంతో వారే తన మెడలోని గొలుసు కాజేశారంటూ ఆదివారం బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బీరప్ప ఉత్సవాల్లో ఎమ్మెల్యే

బషీరాబాద్, మే 19 : మండల పరిధిలోని దామర్‌చేడ్‌లో వెలిసిన బీరప్ప జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొన్నది. గ్రామస్తులు పిండి వంటలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాల్లో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, నాయకులు రామునాయక్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, ఇతర నాయకులను సన్మానిస్తున్న గ్రామస్తులు

మహిళల వేషధారణలో వచ్చి చోరీ

వెంగళరావునగర్, మే 19: మహిళల వేషధారణలో అపార్టుమెంట్‌లోకి ప్రవేశించిన దొంగలు.. ఫ్లాట్ తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన ఎస్ఆర్ నగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని జెక్‌కాలనీలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. జెక్‌కాలనీ 4వ వీధిలోని ఆకృతి ఆక్రేడ్‌లో ఉన్న 502 ఫ్లాట్‌లో ప్రైవేటు ఉద్యోగి కె.వెంకటేశ్వర్‌రావు ఉంటున్నారు. అదే అపార్టుమెంట్‌లోని 406 ఫ్లాట్‌లో ఆయన కూతురు, అల్లుడు కూడా ఉంటున్నారు. కాగా, వెంకటేశ్వర్‌రావు 16వ తేదీ రాత్రి ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి ఒంగోలు వెళ్లారు. 18వ తేదీ శనివారం ఉదయం ఇంటి పని మనిషి వచ్చింది. 406 ఫ్లాట్‌లో ఉంటున్న వెంకటేశ్వర్‌రావు కూతురు ఇంటికి వెళ్లి తాళం చెవి తీసుకొని 502 ఫ్లాట్‌కు వచ్చింది. అయితే, ఇంటి తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించి, ఇంట్లోకి వెళ్లి చూడగా సామగ్రి అంతా చిందరవందరగా కనిపించడంతో వెంకటేశ్వర్‌రావు కూతురుకు విషయం చెప్పింది. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. సీసీ కెమెరాలను పరిశీలించగా.. 18వ తేదీ తెల్లవారు జామున మహిళల వేషధారణలో ముసుగులు ధరించిన ఇద్దరు దుండగులు అపార్టుమెంట్‌లోకి చొరబడి 502 ఫ్లాట్ తాళం పగులగొట్టి ఇంట్లోని అల్మారాలో దాచిన 4 తులాల బంగారు ఆభరణాలు, లక్ష నగదు, ఓ ల్యాప్‌టాప్ తీసుకుని ఉడాయించారు.. బాధితులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

చంపుతానని బెదిరించిన వ్యక్తికి..

రెండేండ్ల జైలు శిక్ష.. జరిమానా

కాచిగూడ,మే 19: పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని డాక్టర్‌పై దాడిచేసి, చంపుతానని బెదిరించిన ఓ వ్యక్తికి రెండేండ్ల జైలు శిక్షతో పాటు రూ.11 వేల జరిమానా విధిస్తూ నాంపల్లిలోని 4వ ఆదనపు మెట్రోపాలిటన్ కోర్టు తీర్పునిచ్చింది. కాచిగూడ ఇన్‌స్పెక్టర్ పి.లక్ష్మీకాంత్‌రెడ్డి కథనం ప్రకారం.. బర్కత్‌పురలోని వైష్ణవి చిత్రకూటి అపార్టుమెంట్‌కు చెందిన అరుణ్ కిరణ్‌కుమార్ ప్రైవేటు ఉద్యోగి. గతేడాది జూలై 12వ తేదీ రాత్రి పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని అదే అపార్టుమెంట్‌కు చెందిన డాక్టర్ శశిధర్‌ను దుర్భాషలాడుతూ, దాడి చేశాడు. డాక్టర్ కాచిగూడ పోలీసులకు సమాచారం మిచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, అరుణ్ కిరణ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి, అరెస్టు చేశారు. ఆ తర్వాత కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. శనివారం నాంపల్లి కోర్టులో అరుణ్ కిరణ్‌కుమార్‌ను హాజరుపరచగా.. న్యాయమూర్తి అతడికి రెండేండ్ల జైలు శిక్షతో పాటు రూ.11 వేల జరిమానా విధించారు.

ప్రమాద బాధితుడికి స్పీకర్ పరామర్శ

వికారాబాద్, మే 19 : వికారాబాద్ పట్టణంలోని మూడు రోజుల కిందట నాగలక్ష్మి హార్డ్‌వేర్ దుకాణంలో అగ్ని ప్రమాదం జరిగింది. ఆదివారం తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ ఘటనా స్థలాన్ని సందర్శించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. షాపు యజమాని కృష్ణకు నేనున్నానంటూ భరోసా కల్పించారు. వారి వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరమేశ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, నాయకులు, వ్యాపారులు తదితరులు ఉన్నారు.

అన్నదానం మహాదానం

యాలాల,మే19: అన్నదానం మహాదానం అని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. ఆదివారం తాండూరు పట్టణంలో ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్, ఐవీఎఫ్ సహకారంతో ఐవీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రొంపల్లి సంతోశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ... ఆకలితో ఉన్నవారి కడుపు నింపడం గొన్న కార్యమన్నారు. వేసవి దృష్ట్యా సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి నెల రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని కొనసాగించడం సంతోషాన్ని కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సినల్ చైర్ పర్సన్ స్వప్న, నాయకులు కరణం పురుషోత్తంరావు, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

మర్పల్లి, మే 19 : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ సర్సింహారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి అడ్మిషన్లు తీసుకుంటున్నామని తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్యా బోధన అందిస్తామని తెలిపారు. అలాగే విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను సరఫరా చేయనున్నట్లు తెలిపారు. అన్ని వసతులతో కూడిన తరగతి గదులు ఉన్నాయని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ వస్తుందని తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, గ్రూపుల్లో తెలుగు, ఇంగ్లీష్ మీడియాలలో, సీఈసీ ఉర్దూ మీడియం, ఒకేషనల్ తెలుగు, ఇంగ్లీష్ మీడియం ఉందని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు అడ్మిషన్ తీసుకోవాలని సూచించారు.

ఇంటర్‌లో స్పాట్ అడ్మిషన్స్‌కు కౌన్సెలింగ్

కొడంగల్, మే 19 : కొడంగల్‌లోని తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ప్రిన్సిపాల్ బలరాం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థులు అడ్మిషన్ పొందేందుకు అర్హులని తెలిపారు. ఈ నెల 23న హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్, మానసహిల్స్‌లో ఉన్న ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయంలో ఇంటర్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి ఎంపీసీ, బైపీసీలో మిగిలిన సీట్లకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు సంబంధిత సర్టిఫికెట్‌లతో ప్రాంతీయ కార్యాలయంలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8333925370, 7013770643, 7032759950 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఐపీఎల్ బెట్టింగ్ 'మాఫియా'

- శివారు ప్రాంతాల్లో అడుగడుగునా బెట్టింగులే
- వేలతో బెట్టింగ్.. లక్షల్లో ఆదాయం అంటూ యువతకు గాలం
- టీవీ,సెల్‌పోన్లతోనే బిజీగా గడుపుతున్న వైనం

మణికొండ, మే 19: హలో... ఈరోజు రాయల్ చాలెంజ్ టీం విన్నింగ్ బెట్టింగ్ పై రూ.ఐదువేలు వేస్కో... ఫస్ట్ సిక్స్‌పై రూ.వెయ్యి పెట్టేస్కో... సిక్స్ మిస్సా... వెయ్యి మిస్సే... కాదు కాదు సిక్స్ కొట్టిండా..? అయితే రూ. రెండు వేలు ఇచ్చుకో.. అంటూ.. ఇలా నిత్యం వందలాది ఫోన్లు నగర శివారు ప్రాంతాల్లో మోగుతున్నాయి. యువత ఈ బెట్టింగ్ మాఫియాలో కూరుకుపోయి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్న వైనమిది.

నార్సింగి, మణికొండ, హైదర్షాకోట్, మంచిరేవుల, పుప్పాల్‌గూడ, కోకాపేట, ఖానాపూర్, గండిపేట, వట్టినాగులపల్లి తదితర గ్రామాల్లోని కొంత మంది యువత ఐపీఎల్ క్రికెట్ బెట్టింగులకు దాసోహమవుతున్నారు. కొన్ని రోజుల కిందట గ్రామాల్లో పర్యటించిన బెట్టింగ్ రాయుళ్లు స్థానిక యువకులకు బెట్టింగ్‌లపై అవగాహన కల్పించినట్టు తెలిసింది. క్రికెట్ మ్యాచ్ షురూ అయిన క్షణం నుంచి నలుగురు కలిసి టీవీ ముందు కూర్చొని పలానా టీం పక్షాన తన బెట్టింగింత.. అంటూ యథేచ్ఛగా గ్రామాల్లో బెట్టింగులు నిర్వహిస్తున్నారు. వంద నుంచి మొదలైన ఈ వ్యవహారం.. ప్రస్తుతం పదివేలు, ఇరవై వేల నుంచి లక్ష రూపాయల వరకు జరుగుతుందంటే పరిస్థితి ఎంతవరకు వెళ్లిందో అర్థం చేసుకోవచ్చు. ఈ బెట్టింగు మాఫియా కారణంగా చాలామంది యువత అప్పులు చేసి తల్లిదండ్రులకు తీరని ఇబ్బందులను తెచ్చి పెడుతున్నారు. కొన్ని కుటుంబాల్లో ఆత్మహత్యల వరకు కూడా వెళ్తుందని పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సెల్‌ఫోన్లే కీలకం...

మ్యాచ్ మొదలయ్యిందంటే చాలు సెల్ ఫోన్లలోనే బెట్టింగులు షురూ చేస్తున్నారు. ఈ రోజు మ్యాచ్‌పై తన వాటా.. లేదా తమ నలుగురి బెట్టింగింతా.. అంటూ సదరు వ్యక్తులకు ఫోన్లు చేయడం.. మ్యాచ్ గెలిచినా, ఓడినా ఆ గ్రూపంతా ఓ చోట కలుసుకుని డబ్బులను పంచుకోవడం శివారు గ్రామాల్లో పరిపాటిగా మారింది.

నిఘా కొరవడటంతో..

పోలీసులు, ఎస్ఓటీ, ప్రత్యేక బృందాలున్నప్పటికీ ఈ బెట్టింగుల వ్యవహారాలపై పెద్దగా పట్టించుకోవడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో సాయంత్రం అయ్యిందంటే చాలు యువకులు గ్రామ శివారుల్లో ప్రత్యేకంగా గదులను ఏర్పాటు చేసుకుని, అందులో టీవీలు పెట్టుకుని బెట్టింగులు నడిపిస్తున్నారు. గత ఐపీఎల్ సీజన్‌లో హైదర్షాకోట్‌లో ఓ బెట్టింగ్



ముఠాను ఎస్ఓటీ పోలీసులు పట్టుకుని వారివద్ద నుంచి భారీగా నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇక నార్సింగి, మణికొండ, మంచిరేవుల, పుప్పాల్‌గూడ తదితర ప్రాంతాల్లో ఏకంగా పలు అపార్టుమెంట్లలోనే యథేచ్ఛగా బెట్టింగులు నిర్వహిస్తుండగా, ఖానాపూర్, వట్టినాగులపల్లి ప్రాంతాల్లో చిన్న చిన్న కిరాణా దుకాణాల్లో యువత బెట్టింగులు కాస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి బెట్టింగు రాయుళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్లాట్ కోసం పంచాయితీ.. ఇద్దరికి గాయాలు

బండ్లగూడ, మే 19: ఓ ప్లాట్ విషయమై ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఒకరిపై ఒకరు కత్తులతో దాడి చేసుకున్నారు. ఈ సంఘటన ఆదివారం ఉదయం అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పిల్లర్ నంబర్ 226 దగ్గర జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని గాయాలైన ఇద్దరిని దగ్గరలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆస్తి తగాదాల వల్లనే ఇద్దరి మధ్య గొడవ జరిగిందని పోలీసుల దర్యాప్తులో తేలింది. కేసు నమోదు చేసుకోని పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా ఆదివారం సాయంత్రం మాదాపూర్‌లోని శిల్పారామంలో నృత్యకారుల ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. చెన్నై నుంచి విచ్చేసిన విశ్వశిఖర నాట్యాలయ భరతనాట్య గురువులు మీనా, కృష్ణ ప్రియ తమ శిష్య బృందంతో కలిసి నర్తించారు.

- కొండాపూర్

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663. NT-327714-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న, లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బ్యాంకు ఖాతాలకు కమీషన్ ఏజెంట్లు

దుబాయ్‌లో ఉండే ఇండియన్స్‌కు ఎర
పది వేలకు ఆశ పడి నిందితులుగా మారుతున్న ఖాతాదారులు

సిటీబ్యూరో, మే 19 (నమస్తే తెలంగాణ): దుబాయ్‌లో వివిధ పనులు చేసే భారతీయులకు డబ్బు ఆశ చూపి.. వాళ్ల బంధువులు, తెలిసిన వారి పేర్లతో సైబర్‌నేరగాళ్లు బ్యాంకు ఖాతాలు తెరిపిస్తున్నారు. ఈ బ్యాంకు ఖాతాలనే సైబర్‌నేరాలకు ఉపయోగిస్తున్నారు. కమీషన్లకు ఆశపడిన కొందరు బ్యాంకు ఖాతాలు తెరిచి ఇస్తున్నారు. పోలీసు కేసుల్లో చిక్కుకొని నేరస్తులుగా మారుతున్నారు. దుబాయ్ అడ్డాగా నేడు చైనా సైబర్‌నేరగాళ్లు నేరాలను చేయడంలో ఆరితేరిపోయారు. ఇందుకు ఎక్కడికక్కడ కమీషన్ ఏజెంట్లను నియమించుకుంటూ.. సైబర్‌దోపిడీని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. తాజాగా, హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు ఐదుగురు బ్యాంకు ఖాతాదారులను అరెస్టు చేశారు. వీరంతా దుబాయ్‌లో సైబర్‌నేరగాళ్ల ట్రాప్‌లో పడ్డ వారు కావడం గమనార్హం.

ఒక్కో ఖాతాకు రూ.10 వేలు..

ఉత్తర, ఈశాన్య భారతదేశంలో రూ.10 వేలకు బ్యాంకు ఖాతాలు కొంటూ సైబర్ నేరగాళ్లు నేరాలకు పాల్పడ్డారు. నెమ్మదిగా దక్షిణ భారతదేశంలోనూ సైబర్‌నేరగాళ్ల తమ నేరాలకు కావాల్సిన బ్యాంకు ఖాతాలను సమకూర్చుకుంటున్నారు. ఏకంగా వాట్సాప్, టెలిగ్రామ్‌లో ప్రకటనలిస్తూ.. తమకు బ్యాంకు ఖాతాలు కావాలని, కమీషన్ ఇస్తామంటూ మోసాలకు పాల్పడుతున్నారు. తాజాగా, ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు విదేశాల్లో పనిచేసే భారతీయులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. సైబర్‌నేరగాళ్లు నేరుగా ఎక్కడ కూడా తమ వివరాలను వెల్లడించడంలేదు. మధ్యవర్తుల ద్వారానే అన్ని పనులు చేస్తుంటారు. మధ్యవర్తుల ద్వారా దుబాయ్‌లో పనిచేసే వారితో సంప్రదింపులు జరుపుతున్నారు. ఒక్కో బ్యాంకు ఖాతాకు అక్కడ మధ్యవర్తులు ఒకరేట్ మా